క్లుప్తంగా

పొంచి ఉన్న ప్రమాదం


వినాయకపురంలో పొలాల మధ్య తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలు

ఐరాల: మండలంలోని వినాయకపురంలో పొలాల మధ్య ట్రాన్స్‌ఫార్మర్ నుంచి మోటార్లకు అమర్చిన విద్యుత్ తీగలు తక్కువ ఎత్తులో ఉండడంతో ఏ క్షణం ఏమి జరుగుతుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. పలుమార్లు మండల విద్యుత్ అధికారులకు సమాచారం అందించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తీగలను సరిచేయాల్సినఅవసరం ఎంతైనా ఉంది.

కొత్తూరు కాలనీకి భూమిపూజ


నూతన రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న మేయర్ అముద

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని ఒకటవ వార్డులోని కొత్తూరు కాలనీ రోడ్డు నిర్మాణానికి శుక్రవారం మేయర్ అముద భూమిపూజ చేశారు. ఈ రోడ్డు నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేసినట్లు ఆమె తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎల్‌బీఐ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

పెరుమాళ్లపల్లెలో గంగమ్మకు పూజలు

బంగారుపాళెం: మండలంలోని పెరుమాళ్లపల్లెలో శుక్రవారం గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి వార్షిక పూజోత్సవంలో భాగంగా ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం అమ్మవారి మూలవిగ్రహాన్ని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. పెద్ద సంఖ్యలో మహిళలు, గ్రామస్తులు అమ్మవారికి పూజలు చేసి, మొక్కులు చెల్లించారు. ఆలయం వద్ద భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

అయోధ్య అక్షింతలు పంపిణీ


పద్మావతినగర్‌లో అయోధ్య అక్షింతలు పంపిణీ చేస్తున్న రామభక్తులు

బంగారుపాళెం: మండలంలోని తగ్గువారిపల్లె పంచాయతీ పద్మావతినగర్‌లో శుక్రవారం రామభక్తులు అయోధ్య అక్షింతలను పంపిణీ చేశారు. గ్రామంలోని హిందూ కుటుంబాలకు వెళ్లి అక్షింతలు అందజేశారు. అంతకు ముందు స్థానిక వినాయకుని గుడి వద్ద అక్షింతలకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అభికమ్మ, రవీంద్రప్రసాద్, బాలసుబ్రమణ్యం, మోహన్, చిన్నదొరై పాల్గొన్నారు.

చెన్నారెడ్డి పల్లెలో అన్నదానం

యాదమరి: మండలంలోని చెన్నారెడ్డి పల్లెలో ఓంశక్తి భక్తులు అన్నదానం చేశారు. గ్రామంలో ఓంశక్తి మాలధారణ భక్తులు ద్రౌపదీ ధర్మరాజుల ఆలయం వద్ద ఓంశక్తి అమ్మవారి చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి అమ్మవారి చిత్రపటాన్ని పుర వీధు ల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఓంశక్తి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఇంటింటా మెరుగైన వైద్యం


వైద్య సేవలందిస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

ఐరాల: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికీ మెరుగైన వైద్యసేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని సవటపల్లెలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో వైద్యాధికారి 80 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, చిన్న పిల్లలకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. దీర్ఘకాలిక రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని మందులు అందజేసి సూచనలు, సలహాలు ఇచ్చారు. అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ జీవకళ, హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

గుండెపోటుతో హెచ్‌ఎం మృతి


హరి (ఫైల్)

ఐరాల: పూతలపట్టు మండలం చిగరపల్లెమిట్టకు చెందిన హెచ్‌ఎం హరి(50) గుండెపోటుతో శుక్రవారం సాయంత్రం మృతి చెందారు. మండలంలోని నాంపల్లె జెడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎంగా ఆయన విధులు నిర్వహిస్తున్నారు. విధులు ముగించుకుని ఇంటికి వెళ్లిన తర్వాత గుండెపోటు రావడంతో కుప్పకూలి తుదిశ్వాస విడిచారు.

ఆరోగ్య సమాజమే ప్రభుత్వ లక్ష్యం

- సురక్ష శిబిరంలో డీఎంహెచ్‌ఓ ప్రభావతి
- కొనసాగుతున్న ఆరోగ్య సురక్ష-2



గుడిపాల: నరహరిపేట ఉన్నత పాఠశాలలో జగనన్న సురక్ష శిబిరానికి హాజరైన జనం, తవణంపల్లె: సరకల్లులో జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లు అందజేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

గుడిపాల: ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యమని డీఎంహెచ్‌ఓ ప్రభావతి అన్నారు. మండలంలోని నరహరిపేట హైస్కూల్లో శుక్రవారం స్థానిక సర్పంచ్ రజనీకాంత్ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం-2 నిర్వహించారు. దీనికి హాజరైన డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి నాణ్యమైన వైద్యసేవలు అందించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రజలందరికీ ఉచితంగా వైద్యసేవలు అందించి ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా జగనన్న ప్రభుత్వం వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్యసేవలు దేశంలో ఎక్కడా లేవని, ఈ సేవలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తాయని చెప్పారు. ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపులలో వైద్య నిపుణులు రోగులకు సేవలు అందిస్తున్నట్లు వివరించారు. రోగి ఆరోగ్య పరిస్థితిని బట్టి వారికి మెరుగైన వైద్య పరీక్షలు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అనంతరం జిల్లా అంధత్వ సంస్థ ఆధ్వర్యంలో పలువురికి కంటి అద్దాలను ఆమె అందజేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్స్‌ను ఆమె పరిశీలించారు. పౌష్టికాహారం వల్ల కలిగే లాభాల గురించి వివరించారు. 451 మంది ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఓపీకి హాజరయ్యారు. కార్యక్రమంలో డీఎంఓ శ్రీనివాసులు, జెడ్పీవైస్ చైర్మన్ రమ్య, ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, ఎంపీడీవో రాజశేఖర్‌రెడ్డి, వైద్యులు సంధ్య, చంద్రమహేష్, వైద్యసిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు సాయిక్రిష్ణ, గుండు సాయి, రెడ్డప్ప, సుశేంద్రారెడ్డి పాల్గొన్నారు.

303 మందికి వైద్యసేవలు

ఐరాల: ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని కామినాయనపల్లె సర్పంచ్ బంగారమ్మ, వైస్ సర్పంచ్ సోమనాథ్‌రెడ్డి అన్నారు. మండలంలోని వైఎస్ గేటు ప్రాథమిక పాఠశాల ఆవరణలో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. శిబిరంలో 303 మందికి స్పెషలిస్ట్ డాక్టర్లు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వృద్ధులకు కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా కళ్లజోడు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు విజయానందరెడ్డి, రంగారెడ్డి, కాణిపాకం వైద్యులు స్వాతి సింధూర, రాజేశ్వరి, స్పెషలిస్ట్ డాక్టర్లు శిరీష, శారద, హరిప్రసాద్, ఎంపీడీఓ నాగరాజు, ఎంపీటీసీ సభ్యుడు పట్టాభి, ఎంపీహెచ్‌ఈఓ శివయ్య, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం

బంగారుపాళెం: గ్రామాల్లో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు పేదలకు వరమని గుండ్లకట్టమంచి సర్పంచ్ శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ చంద్రారెడ్డి అన్నారు. మండలంలోని చీకూరిపల్లెలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష-2 వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరంలో బీపీ, షుగర్, థైరాయిడ్, దంత, కీళ్లనొప్పులు తదితర జబ్బులకు వైద్యులు పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. వారు మాట్లాడుతూ, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామీణ ప్రాంత పేదల ఆరోగ్యానికి పెద్ద పీట వేశారన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో జగనన్న ఆరోగ్య సురక్ష అనే కార్యక్రమాన్ని తీసుకువచ్చారని చెప్పారు. వైద్య శిబిరంలో వైద్యులు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందిస్తున్నట్లు చెప్పారు. ప్రజల శ్రేయస్సు, సంక్షేమం గురించి నిరంతరం ఆలోచించే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు ఆశీర్వదించాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని జిల్లా క్షయ నివారణాధికారి డాక్టర్ వెంకటప్రసాద్ తనిఖీ చేశారు. సిబ్బందికి సూచనలు సలహాలు అందజేశారు. కార్యక్రమంలో మండల వైద్యధికారి డాక్టర్ లోహిత్‌చెంగల్ రాయన్, డాక్టర్లు శిరీష,లోకేష్, రమ్య, డీపీఎం మణి, ఎంపీహెచ్‌ఈఓ రమేష్‌బాబు, సచివాలయ ఉద్యోగులు, ఆరోగ్యసిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు,ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు

యాదమరి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు వైద్యులు అనిల్‌కుమార్ నాయక్, సురేఖ తెలిపారు. మండలంలోని జంగాలపల్లె సచివాలయ పరిధిలో శుక్రవారం గ్రామీణ ప్రజలకు జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని వైద్యులు నిర్వహించారు. గ్రామీణ ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించి మందులు పంపిణీ చేశారు. అనంతరం గ్రామీణ ప్రజలకు ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ లక్ష్మీనారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యకర గ్రామాలే లక్ష్యం

తవణంపల్లె: ఆరోగ్యకరమైన గ్రామాలుగా తీర్చిదిద్దడమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని మండల సచివాలయ కన్వీనర్ హరికృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని సరకల్లులో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ ప్రియాంక, మోహన్‌వేలు, వినయ్‌కుమార్, ఆర్థోస్పెషలిస్ట్ చంద్రశేఖర్, గైనకాలజిస్ట్ శర్మద, జిల్లా కంటి వైద్య నిపుణులు అర్పిత 355 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. కంటి రోగులు 40 మందికి, ఎముకలు, కీళ్లకు సంబంధించిన వారిని 70 మందిని, గర్భకోశ వ్యాధిగ్రస్తులు 60 మందిని మెరుగైన వైద్యం కోసం రెఫర్ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్, ఈఓపీఆర్డీ కుమార్, సర్పంచ్ సతీష్‌రెడ్డి, ఎంపీటీసీ బుజ్జి, వైఎస్సార్‌సీపీ నేతలు మధుకుమార్, పరమేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.


గుడిపాల: సమావేశంలో కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ ప్రభావతి


ఐరాల: సురక్ష శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ స్వాతి సింధూర


బంగారుపాళెం: చీకూరిపల్లె వైద్య శిబిరంలో బాలింతకు వైద్య పరీక్ష చేస్తున్న డాక్టర్


యాదమరి: మాట్లాడుతున్న వైద్యులు అనిల్‌కుమార్ నాయక్, సురేఖ

రెచ్చగొట్టే చర్యలు మానుకోకుంటే సహించం

ఐరాల: ప్రశాంతంగా ఉండే మండలంలో కొందరు టీడీపీ నాయకులు కావాలనే రెచ్చగొట్టే చర్యలకు పాల్పడుతున్నారని, పునరావృతమైతే సహించేది లేదని మండల వైఎస్సార్‌సీపీ నేతలు హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ నేతలు శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ, జగనన్న పేదలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక ఇలాంటి పిరికిపంద చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఐదు సంవత్సరాల్లో వైఎస్సార్‌సీపీ మండలంలో ఇలాంటి చర్యలకు పూనుకుందని ప్రశ్నించారు. కార్యకర్త అభిమానంతో ఏర్పాటు చేసుకున్న 'మా నమ్మకం నువ్వే జగన్' బోర్డును పాక్షికంగా ధ్వంసం చేసిన చెంచాలు భవిష్యత్‌లో తీవ్రపరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. బోర్డును ధ్వంసం చేసిన వారిని తక్షణం అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మండల నేతలు పాల్గొన్నారు.

రేపు గ్రూపు-2 మోడల్ పరీక్ష

చిత్తూరు కలెక్టరేట్ : నూతన సిలబస్‌కు అనుగుణంగా ఈ నెల 21న గ్రూపు-2 ఉచిత మోడల్ పరీక్ష నిర్వహించనున్నట్లు కుట్టి స్టడీ సర్కిల్ డైరెక్టర్ పవనకుమారి తెలిపారు. ఆమె శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో నూతన సిలబస్ ప్రకారం ఉచిత మోడల్ పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఆదివారం ఉదయం మిట్టూరులో ఉన్న కుట్టి స్టడీ సర్కిల్‌లో నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్ష రాయాలనుకునే అభ్యర్థులు 9491844963 కు వాట్సాప్‌కు వివరాలు పంపాలని తెలిపారు.

కాణిపాకంలో స్వచ్ఛ తీర్థ సేవ



కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయ పరిసరాల్లో స్వచ్ఛ తీర్థ సేవా కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఐదో రోజు ఉదయం చైర్మన్ కార్యాలయ ఆవరణ, అతిథి భవనాలు, సబ్‌స్టేషన్, తదితర ప్రాంతాల్లో పరిశుభ్రం చేశారు. ఆలయ ఈఓ వెంక టేశు, ఏఈఓలు ఎస్వీ కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ వాసు, కోదండపాణి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు తిరు మల గిరిబాబు దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి

చిత్తూరు అర్బన్: నగరపాలక పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో నిర్దేశించిన వసతుల కల్పనకు సత్వర చర్యలు తీసుకోవాలని ఏఈఆర్వో, కమిషనర్ అరుణ సంబంధిత అధికారులను ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో వసతులపై శుక్రవారం సెక్టోరియల్ అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు, వార్డు అమినిటీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ సెక్టోరియల్ అధికారులు వారి పరిధిలోని పోలింగ్ కేంద్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి నిర్దేశించిన వసతులపై సమగ్ర నివేదికలను అందించాలన్నారు. సెక్టోరియల్ అధికారులు అందించిన నివేదికల ఆధారంగా పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాల కల్పనపై ఇంజినీరింగ్ అధికారులు వేగంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగరపాలక పరిధిలోని 150 పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, మరుగుదొడ్లు, నీటి సరఫరా, ఫర్నిచర్ సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో చేపట్టాల్సిన పనులకు సంబంధించి అంచనాలను సత్వరం సమర్పించాలని వార్డు అమినిటీ కార్యదర్శులను ఆదేశించారు. సమావేశంలో ఎంఈ గోమతి, డీఈలు, ఏఈలు, సెక్టోరియల్ అధికారులు, వార్డు అమినిటీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వసతులు ఉండేలా చూడాలి

గుడిపాల: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రతి పోలింగ్ బూత్‌లోను మౌళిక వసతులు ఖచ్చితంగా ఉండాలని హౌసింగ్ డీఈ గురురాజన్, ఎంపీడీవో రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో పోలింగ్ బూత్‌ల్లో వసతులపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మండలంలో 40 పోలింగ్‌బూత్‌లు ఉన్నాయని వీటన్నింటిలో మరుగుదొడ్లు, కరెంట్, తాగునీటి సౌకర్యం, ఫ్యాన్‌లతో పాటు ఎన్నికలకు కావాలసిన సామగ్రిని ఉండేలా చూసుకోవాలన్నారు. వీటికి స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఫండ్స్‌ను ఉపయోగించుకోవాలని చెప్పారు. మరమ్మతులు ఏవైనా ఉంటే ఇంజినీరింగ్ అసిస్టెంట్ల సాయం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ రామ్‌నాయక్, ఎంఈఓ-2 గణపతి, పంచాయతీరాజ్ ఏఈ జయచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చిత్తూరు: మాట్లాడుతున్న కమిషనర్ అరుణ, గుడిపాల: మాట్లాడుతున్న ఎంపీడీవో రాజశేఖర్‌రెడ్డి

17నుంచి రోబో ట్రాక్ పోటీలు

తిరుపతి(అలిపిరి): తిరుపతి ప్రాంతీయ విజ్ఞాన కేంద్రంలో ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ విద్యార్థులకు వచ్చేనెల 17, 18వ తేదీల్లో రోబోట్రాక్- 2024 పోటీలు నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి ప్రొఫెసర్ రాళ్లపల్లి రామమూర్తి, ఎస్వీయూ మాజీ వీసీ సుదీప్తా సాహా శుక్రవారం స్థానిక సైన్స్ సెంటర్‌లో పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మొదటి రోజు పోటీల్లో బృందం లైన్-ఫాలోయింగ్ రోబోట్ పని చేసే విధానంపై ప్రోగ్రామింగ్ చేయాలని తెలిపారు. రెండో రోజు రోబోట్ ట్రాక్‌పై కనిష్ఠ కాలవ్యవధిలో గమ్యాన్ని చేరుకోవాలన్నారు. ఈ పోటీలో విజేతలకు నగదు మొదటి బహుమతిగా రూ.5,000, రెండో బహుమతిగా రూ.3,000, తృతీయ బహుమతిగా రూ.2,000 అందజేయనున్నట్లు పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే వారందరికీ సర్టిఫికెట్లు అందజేస్తామని వెల్లడించారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఫిబ్రవరి 12 లోపు తమ దరఖాస్తులను పంపాలన్నారు. వివరాలకు 0877-2286202, 79896 94681 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

వరసిద్ధుని సేవలో ప్రముఖులు


వినాయకుని సన్నిధిలో సుమ, సునీత

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని యాంకర్ సుమ, సినీ గాయకులు సునీత శుక్రవారం దర్శించుకున్నారు. శుక్రవారం రాత్రి స్వామివారి దర్శనార్థం విచ్చేయగా ఆలయ ఏఈఓ ధనుంజయ స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులచే ఆశీర్వచనం అందించి స్వామివారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ విగ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

యోగివేమనకు కలెక్టర్ నివాళి


నివాళి అర్పిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : యోగి వేమన జయంతి కార్యక్రమం శుక్రవారం కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. వేమన చిత్రపటానికి కలెక్టర్ షణ్మోహన్ పూలమాల వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ విశ్వదాభిరామ వినురవేమ అనే మకుటంతో వంద పద్యాలు రాసిన వేమన తెలుగు వారికి సుపరిచితమన్నారు. వేమనకు నివాళులర్పించిన వారిలో డీఆర్‌ఓ రాజశేఖర్, బీసీ సంక్షేమ శాఖ అధికారి రబ్బాని బాషా, ఏఓ కులశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మండల స్థాయి క్రీడా పోటీలు



క్రీడాకారులను అభినందిస్తున్న ఎంపీడీఓ నాగరాజు, విజేత జట్టుకు కిట్ అందజేస్తున్న ఎంపీడీఓ గౌరి

పూతలపట్టు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆడుదాం ఆంధ్రా' మండల స్థాయి పోటీలు విజయవంతంగా ముగిశాయి. మండలంలోని శుక్రవారం పోలవరం మైదానంలో క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌లను అధికారులు నిర్వహించారు. ఫైనల్‌లో పూతలపట్టు 1, 2 జట్లు తలపడ్డాయి. విజేతగా పూతలపట్టు -1 జట్టు నిలిచింది. ఎంపీడీఓ గౌరి మాట్లాడుతూ మండల స్థాయి పోటీల్లో ప్రతి జట్టు చాలా బాగా ఆడారని, నియోజకవర్గ స్థాయిలో రాణించాలని పిలుపునిచ్చారు. అనంతరం గెలిచిన క్రీడాకారులను కిట్‌ను అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు దేవిక, వైస్ ఎంపీపీ ద్వారకనాథరెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, కో-ఆప్షన్ మెంబర్ ఖాదర్, సర్పంచ్ మాసిలామణి, పంచాయతీ కార్యదర్శులు, పీడీలు కృష్ణ, ఢిల్లీరాణి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఐరాల: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో శుక్రవారం ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు నిర్వహించారు. అందులో భాగంగా పురుషుల బ్యాడ్మింటన్ ఫైనల్ మ్యాచ్‌లో నాగంవాండ్లపల్లె జట్టుపై ఐరాల గెలుపొంది మండల విజేతగా నిలిచింది. ద్వితీయ స్థానాన్ని నాగవాండ్లపల్లె జట్టు సాధించదని ఎంపీడీఓ నాగరాజు తెలిపారు. మహిళల బ్యాడ్మింటన్ ఫైనల్ మ్యాచ్‌లో ఐరాలపై గుండ్లపల్లె జట్టు గెలుపొందినట్లు చెప్పారు. నియోజకవర్గ స్థాయి పోటీలకు అర్హత సాధించిన బ్యాడ్మింటన్ క్రీడాకారులను ఎంపీడీఓ అభినందించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు ఓటములు సహజమన్నారు. ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తితో మెలగాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కుసుమకుమారి, పంచాయతీ కార్యదర్శి శ్యామల, పీడీ దేవ పాల్గొన్నారు.

నెలాఖరుకు టిడ్కో గృహాలు సిద్ధం

- పకడ్బందీగా కులగణన చేయాలి
- పరిసరాలు శుభ్రంగా ఉండాలి
- నగర పాలక సంస్థ కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: నగరపాలక పరిధిలో పూణేపల్లి వద్ద నిర్మిస్తున్న టిడ్కో గృహ సముదాయాలను ఈ నెలాఖరుకు పూర్తి స్థాయిలో సిద్ధం చేయాలని నగర కమిషనర్ అరుణ టిడ్కో అధికారులు, గుత్తేదారులను ఆదేశించారు. కమిషనర్ శుక్రవారం ఉదయం పూణేపల్లి వద్దనున్న టిడ్కో గృహ సముదాయాలను పరిశీలించారు. అక్కడ జరుగుతున్న ఎలక్ట్రికల్, శానిటేషన్, రోడ్ల నిర్మాణం, మురుగునీటి కాలువల నిర్మాణ పనులను పరిశీలించారు. పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని గుత్తేదారులను ఆదేశించారు. పనులన్నీ ఈ నెలాఖరుకు పూర్తిచేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలన్నారు. ప్రారంభోత్సవానికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు పక్కాగా చేయాలని ఆదేశించారు. పూణేపల్లి టిడ్కో గృహ సముదాయంలో 300 చదరపు అడుగులు ఇళ్ల 2,256 ఉండగా, 365 చదరపు అడుగుల గృహాలు 240, 430 చదరపు అడుగుల గృహాలు 336 మొత్తం 2,832 గృహాలను సిద్ధం చేసినట్లు కమిషనర్ వివరించారు. కార్యక్రమంలో టిడ్కో ఈఈ వెంకటముని, సీఎంఎం గోపి, టిడ్కో కన్సల్టెంట్ ధనంజయ రెడ్డి, కాంట్రాక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

తప్పిదాలు లేకుండా కులగణన సర్వే

కుల గణన సర్వే పకడ్బందీగా, తప్పిదాలు తావులేకుండా చేయాలని కమిషనర్ అరుణ అన్నారు. కుల గణన సర్వే తీరును కమిషనర్ శుక్రవారం సత్యనారాయణపురం, వెంకటేశ్వర కాలనీ పరిధిలో పరిశీలించారు. వలంటీర్ యాప్‌లో కుల గణన సర్వేకు సంబంధించిన వివరాల నమోదు అంశాన్ని తనిఖీ చేశారు. ఇంటింటి సర్వే ఏ విధంగా చేస్తున్నారంటూ వలంటీర్లు, వార్డు కార్యదర్శులతో మాట్లాడారు. కమిషనర్ మాట్లాడుతూ, క్లస్టర్ వారీగా మ్యాపింగ్ చేసిన వలంటీర్లు, వార్డు కార్యదర్శులు ఇంటింటికీ వెళ్లి సర్వే పూర్తి చేయాలని చెప్పారు. సర్వే సందర్భంగా ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగాలని, యాప్‌లో నిర్దేశించిన మేర సమాచారాన్ని తప్పులు లేకుండా నమోదు చేయాలని స్పష్టం చేశారు. వారం రోజుల్లో సర్వే పూర్తి చేయాలని, ఇందుకోసం క్లస్టర్ వారీగా వలంటీర్లు రోజువారీ నిర్దేశించిన గృహాల సర్వేను పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీఎంఎం గోపి, వార్డు కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉండాలి

నగరంలో కూరగాయల మార్కెట్లు, కూడళ్లు, ప్రధాన ప్రాంతాల్లో పరిసరాలు శుభ్రంగా ఉంచాలని కమిషనర్ అరుణ ప్రజారోగ్య విభాగం అధికారులను ఆదేశించారు. కమిషనర్ శుక్రవారం ఉదయం కొంగారెడ్డిపల్లి కూరగాయల మార్కెట్లో శానిటేషన్ పనులను తనిఖీ చేశారు. దుకాణదారులతో మాట్లాడారు. కూరగాయల వ్యర్థాలను ఇష్టారాజ్యంగా పడేయరాదని, పారిశుద్ధ్య కార్మికులకు అందివ్వాలన్నారు. మార్కెట్ పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని, వ్యర్థాలను రోజూ తొలగించి శుభ్రం చేయించాలని చెప్పారు. ట్రాఫిక్, ప్రజా రవాణాకు అడ్డంకి లేకుండా దుకాణాలను లోపలవైపు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలో ప్రధాన కూడళ్లలో, రహదారులు ఉదయమే స్వీపింగ్ పనులు పూర్తి చేయాలన్నారు. కమిషనర్ వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరసింహ, సీఎంఎం గోపి పాల్గొన్నారు.


చిత్తూరు నగరంలో టిడ్కో గృహాలను పరిశీలిస్తున్న కమిషనర్ అరుణ


సర్వే ప్రక్రియను తనిఖీ చేస్తున్న కమిషనర్ అరుణ